టీ-మీడియా

Digital, tmedia.net.in

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 289
పేజీలు : 3
మంగళవారం 19.05.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

ఇరాన్ సరికొత్త వ్యూహం

- అండర్‌సీ కేబుల్స్‌పై టోల్
- అమెరికన్ టెక్ కంపెనీలే టార్గెట్?!



టి మీడియా, మే 18, ఢిల్లీ బ్యూరో:పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం చేస్తున్న ఇరాన్, సముద్ర మార్గంలో నౌకలను అడ్డుకుంటూ ఒక్కో నౌకకు 2 మిలియన్ డాలర్లు వసూల్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. కాగా ఇప్పుడు టెహ్రాన్ సరికొత్త వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. హర్మూజ్ జలసంధిని ఒక డిజిటల్ టోల్ బూత్‌గా మార్చేందుకు ఇరాన్ ఐఆర్‌జీసీ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ప్రపంచ ఇంటర్నెట్ వ్యవస్థకు వెన్నుముకగా ఉన్న సముద్రగర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్లపై ట్రాన్సిట్ ఫీజులు వసూలు చేయాలని ప్రతిపాదించింది. అదే జరిగితే ప్రపంచ డేటా వ్యవస్థ ఎలా స్తంభించిపోనుంది సామాన్య ఇంటర్నెట్ యూజర్లపై ఎలాంటి ప్రభావం పడనుంది ఈ కథనంలో చూద్దాం.

ఏకంగా 15 బిలియన్ డాలర్ల ఆదాయం!

హర్మూజ్ జలసంధిలోని అండర్ వాటర్ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్‌పై రవాణా ఫీజును వసూల్ చేయాలని ఇరాన్ భావిస్తోంది. ఈ విషయాన్ని ఐఆర్?జీసీకి చెందిన తస్నిమ్, ఫార్స్ వార్తా సంస్థలు కథనాలు ప్రచురించాయి. హర్మూజ్ జలసంధి కేవలం చమురు రవాణాకే కాదు, ప్రతిరోజూ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లావాదేవీలు జరిగే ఒక రహదారి అని ఇరాన్ అధికారులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 99 శాతానికి పైగా డాటా ప్రవాహం సముద్రగర్భ కేబుళ్ల ద్వారానే జరుగుతోంది. అందులో హర్మూజ్ కూడా ఒక భాగం. అక్కడ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్‌పై పన్ను వసూల్ చేస్తే 15 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1,45,000 కోట్లు) వార్షిక ఆదాయం సమకూరుతుందని ఐఆర్‌జీసీ భావిస్తున్నట్లు తెలిసింది. తమ ప్రాదేశిక జలాలపై తమకు పూర్తి సార్వభౌమాధికారం ఉందని, అందుకే అక్కడ కేబుల్స్‌పై పన్ను విధించే అధికారం తమకు ఉందని ఇరాన్ వాదిస్తోంది.

మూడు అంచెల ప్రణాళిక

అండర్ వాటర్ ఆప్టిక్ ఫైబర్ కేబుల్స్‌పై టోల్ వసూల్ చేసేందుకు ఇరాన్ మూడు అంచెల ప్రణాళికను సిద్ధం చేసింది. అందులో మొదటిది గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి టెక్ దిగ్గజాల కేబుల్స్‌పై ప్రారంభ, వార్షిక రవాణా ఫీజు వసూలు చేయడం. రెండో ప్రణాళికలో భాగంగా ఈ ప్రాంతం గుండా డేటా ప్రవహించాలంటే సదరు టెక్ కంపెనీలు ఇరాన్ చట్టాలకు లోబడి పనిచేయాలని నిబంధన పెట్టాలని ఐఆర్‌జీసీ ప్రతిపాదించింది. ఇక మూడో ప్రణాళికలో భాగంగా కేబుళ్ల మరమ్మతులు, నిర్వహణ బాధ్యతలను పూర్తిగా ఇరాన్ కంపెనీలకే అప్పగించాలని టెక్ దిగ్గజాలకు ఇరాన్ షరతులు పెట్టాలని భావిస్తోంది. తద్వారా నౌకల రవాణా నుంచి డిజిటల్ మౌలిక సదుపాయాల వరకు తన పట్టును పెంచుకోవాలని చూస్తోంది.

ఒకవేళ కేబుల్స్ కట్ చేస్తే!

సముద్రగర్భ కేబుల్స్ అనేవి అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలు, క్లౌడ్ సర్వీసులు, సైనిక కమ్యూనికేషన్లను మోసుకెళ్లే అత్యంత కీలక మార్గాలు. ఒకవేళ యుద్ధంలో భాగంగా హర్మూజ్‌లో ఈ కేబుళ్లకు ఇరాన్ అంతరాయం కలిగిస్తే, పశ్చిమాసియా, ఐరోపాతో పాటు ఆసియా దేశాల మధ్య అనుసంధానత పూర్తిగా దెబ్బతింటుంది. వీటి మరమ్మతులకు వారాలు లేదా నెలల సమయం పడుతుంది. ఫలితంగా అంతర్జాతీయ సమాజంపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ఒకవేళ ఇరాన్ అనుకున్నదే జరిగి డిజిటల్ టోల్ విధానాన్ని అమలు చేయగలిగితే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇంటర్నెట్ వినియోగదారులపై నేరుగా ప్రభావం పడుతుంది. ఇరాన్ విధించే అదనపు నిర్వహణ ఖర్చులను టెక్ కంపెనీలు భరించవు. అవి ఆ భారాన్ని యూజర్లపై నెట్టేస్తాయి. ఒకవేళ హర్మూజ్ మార్గం ఖరీదైనదిగా లేదా చట్టపరంగా రిస్క్‌గా మారితే, టెక్ కంపెనీలు డేటాను వేరే సుదీర్ఘ మార్గాల్లో మళ్లించాల్సి వస్తుంది. దీనివల్ల ఇంటర్నెట్ వేగం తగ్గి, ఆన్‌లైన్ గేమింగ్‌లో లాగ్స్ ఎదురవుతాయి. 4కె స్ట్రీమింగ్ నెమ్మదించడం జరిగే అవకాశం ఉంటుంది.

నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులు పూర్తికావాలి'

- సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

టీ మీడియా, మే 18,అమరావతి బ్యూరో : ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. 2027 ఏప్రిల్ నాటికి పోలవరం నిర్వాసితుల తరలింపు పూర్తికావాలన్నారు. ప్రాధాన్య క్రమంలో క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టులు పూర్తిచేసేలా చర్యలు ఉండాలని నిర్దేశించారు. ఎల్‌నినో పరిస్థితులపై ముందస్తు అంచనాలు సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతుల్ని సమాయత్తం చేయాలని ఆదేశాలిచ్చారు. పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గతంలో ప్రకటించిన 25 ప్రాజెక్టులకు అదనంగా మరో 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండర్‌లో చేర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు కావాల్సిన భూసేకరణ, సివిల్ వర్క్‌కు నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థికశాఖ అధికారులను సూచించారు. పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు సీఎంకు వివరించారు. పోలవరంలో 88 శాతం సివిల్ వర్క్ పూర్తయ్యాయని తెలిపారు.భూసేకరణ 93 శాతం, నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తయిందని వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 2 నాటికి డయాఫ్రమ్ వాల్ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తవుతాయని వివరించారు. పోలవరం కుడి కాలవను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

సస్యశ్యామలంగా రాయలసీమ : హంద్రీనీవా ఫేజ్-1లో భాగంగా కాలువల వెడల్పు 92 శాతం పూర్తిచేసినట్లు అధికారులు సీఎంకు నివేదించారు. ఫేజ్-2లో కుప్పం నుంచి పుంగనూరు కాలువల లైనింగ్ పనులు 85 శాతం చేసినట్లు వెల్లడించారు. మల్యాల లిఫ్ట్ నుంచి రాయలసీమ ప్రాంతానికి తొలిసారిగా 52 టీఎంసీల నీటిని తరలించామని చెప్పారు. మొత్తంగా 432 చెరువులు నింపామన్నారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు 2 వేల 123 కోట్లు వెచ్చించినట్లు వివరించారు.పోలవరం పనుల పురోగతిపై ప్రతి నెలా సమీక్ష చేస్తానని సీఎం స్పష్టంచేశారు. ఈసీఆర్?ఎఫ్? డ్యామ్ పనులు చెప్పిన సమయానికి పూర్తి చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ ఏడాది జులై నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరివ్వాలని ఆదేశించారు. ఎడమ కాలువ ద్వారా పోలవరం జలాలను మేఘాద్రిగడ్డకు తీసుకెళ్లాక అక్కడి నుంచి వంశధార-నాగావళి-చంపావతి వరకూ నీరు వెళ్లేలా చూడాలని నిర్దేశించారు. మేఘాద్రిగడ్డ నుంచి చంపావతి లింక్‌కు ఎంత వ్యయమవుతుందో అధ్యయనం చేయాలన్నారు. ఎలాంటి వివాదాలు లేకుండా పోలవరం ఆర్? అండ్? ఆర్ వేగంగా పూర్తికావాలన్నారు. పోలవరం స్పిల్ వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మించి బెస్ట్ టూరిజం ప్రాంతంగా తయారుచేయాలని స్పష్టంచేశారు.

మొదటి దశ పూర్తికావాలని సీఎం ఆదేశం

జులై నాటికి వెలిగొండ మొదటి దశ పూర్తికావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్? అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ పనుల కోసం ఇంకా 2 వేల 19 కోట్లు అవసరమన్నారు. టన్నెల బోరింగ్ మిషన్- టీబీఎం ను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలన్నారు. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్స్ పనులు వేగంగా చేయాలని ఆదేశించారు. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీలా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. హంద్రీ నుంచి నీవా వరకూ నీళ్లు తీసుకెళ్లేలా పనులు పూర్తి చేయాలన్నారు. నీళ్లు చూస్తే ప్రజల్లో ఓ నమ్మకం వస్తుందన్నారు. మైదుకూరు, మడకశిర వంటి చివరి ప్రాంతాలకూ నీరు వెళ్లాలని స్పష్టంచేశారు.అదే విధంగా కల్యాణి డ్యామ్, నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా మూలపల్లి చెరువుకు నీరిచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల కాలువ పనులు వచ్చే ఏడాది జులైకి పూర్తికావాలని సీఎం గడువు నిర్దేశించారు. వరికెపూడిశెలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంపాక్ట్ స్టడీ చేయాలన్నారు. అంతర్రాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టులు పూర్తి చేసుకుందామన్నారు. సల్లమలసాగర్ విషయమై కేంద్రంతో మాట్లాడదామన్నారు. గోదావరి- కావేరి అనుసంధానంపైనా కేంద్రంతో సంప్రదింపులు జరుపుదామన్నారు. నెల్లూరు జిల్లా సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈసారి వర్షపాతం మైనస్ 3 శాతంగా ఉందన్నారు.నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉన్నాయని ఇది గత ఏడాదితో పోలిస్తే 0.5 మీటర్లు తక్కువని గుర్తుచేశారు. ప్రస్తుత నీటి వనరుల్ని నింపేలా స్ట్రక్చర్ల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. నీటి భద్రతపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జలధార-జలహారతి కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం సుమారు 17 వేల కోట్ల వ్యవసాయ విద్యుత్ ఖర్చులు భరిస్తున్నామని సీఎం తెలిపారు. భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ వినియోగం తగ్గుతుందని తద్వారా ప్రభుత్వంపై విద్యుత్ భారం కూడా తగ్గుతుందని సీఎం అన్నారు.

తెలంగాణ వడ్లకు కర్ణాటకలో భారీగా డిమాండ్

- 3 కీలక జిల్లాల్లో క్రాప్ హాలిడే

టి మీడియా, మే 18, హైదరాబాద్ బ్యూరో : రాష్ట్రంలో యాసంగి సీజన్?లో వస్తున్న వడ్లలో సన్నాలకు పక్క రాష్ట్రాల్లో డిమాండ్? బాగా ఉంది. మరీ ముఖ్యంగా కర్ణాటకలోని కొన్ని జిల్లాల్లో డిమాండ్? ఎక్కువగా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో అయితే నారాయణపేట, గద్వాల జిల్లాలతో పాటు నిజామాబాద్? జిల్లాలోని బోధన్? నియోజకవర్గంలో పండించిన సన్న ధాన్యాన్ని అధికంగా కర్ణాటక వ్యాపారులే పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. అంతేకాదు మహబూబ్?నగర్?, వికారాబాద్? జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి.ప్రస్తుతం కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్? 33 గేట్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఫలితంగా కర్ణాటకలోని రాయచూరి, బళ్లారి, కొప్పళ తదితర జిల్లాల్లో క్రాప్? హాలిడే (పంట విరామం) ప్రకటించారు. అంతేకాదు బెంగళూరువాసులు తినే సన్న బియ్యం సింహభాగం ఈ ప్రాంతం నుంచే వెళ్లేదని పౌర సరఫరాల సంస్థ అధికారి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో యాసంగి సన్న ధ్యానం కర్ణాటకలోని ఈ జిల్లాలకు ప్రస్తుతం గణనీయంగా వెళుతోందని తెలిపారు. ఇక రాష్ట్రంలోని వరి కోతలు ముందుగా మొదలయ్యే బోధన్? నియోజకవర్గం నుంచి దాదాపు రెండు లక్షల టన్నుల్ని ప్రధానంగా కర్ణాటక, మహారాష్ట్ర వ్యాపారులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

ఆంధ్ర వ్యాపారులు, రైస్ మిల్లర్లు సైతం :

ఏపీ వ్యాపారులు, రైస్? మిల్లర్లు రైతుల నుంచి సన్నధాన్యం భారీగా కొంటున్నారు. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల నుంచి ఏపీ, చైన్నె వ్యాపారులు మధ్యవర్తుల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. మిర్యాలగూడలో పెద్ద సంఖ్యలో ఉండే మిల్లర్లు సైతం రైతుల నుంచి సన్న ధాన్యం కొంటున్నారు. యాసంగి సీజన్?లో 90 లక్షల టన్నుల ధాన్యం కొంటామని పౌర సరఫరాల శాఖ ప్రకటించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని పరిశీలిస్తుంటే 75-80 లక్షల టన్నుల్లోపే ఉండొచ్చని పౌర సరఫరాల సంస్థ అధికారి అభిప్రాయపడ్డారు. సన్నధాన్యాన్ని ఇతర రాష్ట్రాల వ్యాపారులు కొంటుండటమే ప్రధాన కారణమని అన్నారు.

కనీస మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

రైతులు పండించిన ప్రతి గింజను కనీస మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్? కుమార్? రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో శ్రీ లక్ష్మీ గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన ఇటీవల పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సర్కారు ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. ఈ మేరకు రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులు పండించిన చివరి గింజ వరకూ మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు.కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు : ఇదిలా ఉండగా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. పండించిన పంట అమ్ముకునేందుకు రైతులకు కష్టాలు తప్పట్లేదు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా, కొనుగోళ్ల సాగక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పండించిన పంట అకాల వర్షాలకు తడిస్తే తమ పరిస్థితి ఏంటని అన్నదాత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లపై 600 కేసులు

- చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్న వైద్యారోగ్య శాఖ

టి మీడియా, మే 18, హైదరాబాద్ బ్యూరో :

ప్రజల ప్రాణాలు కాపాడే ప్రత్యక్ష దైవం వైద్యుడు. మరి అలాంటి వృత్తిలో స్థిరపడేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంటుంది. అయితే అవేమీ లేకుండా తామే ప్రముఖ డాక్టర్లమంటూ కొందరు నకిలీ వైద్యులు రాష్ట్రంలో అనేక చోట్ల క్లినిక్‌లు నడుపుతున్నారు. సరైన వైద్య పట్టా లేకుండా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇలాంటి శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లపై చర్యలు తీసుకోవడంలో వైద్య ఆరోగ్య శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. కేవలం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఇలాంటి వైద్యులపై ఇప్పటి వరకు 600 వరకు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. అయితే దీనికి సంబంధించిన కార్యాచరణ మాత్రం ముందుకు సాగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) ఆయా క్లినిక్‌లలో తనిఖీలు చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై కేసు నమోదు చేసి సమాచారాన్ని తదుపరి చర్యలకు జిల్లా కలెక్టర్, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖాధికారి, డ్రగ్స్ నియంత్రణ అథారిటీకి అందజేస్తుంది. ఇలాంటి క్లినిక్‌లపై తెలంగాణ మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం (టీఎంపీఆర్), నేషనల్ మెడికల్ మిషన్ (ఎన్ఎంసీ) చట్టం సెక్షన్ 34, 35 ప్రకారం చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

సీజ్‌చేసే అవకాశం ఉన్నప్పటికీ

ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే ఇప్పటి వరకు 200లకు పైగా కేసులు నమోదు కాగా, చర్యలు లేకపోవడంతో హైకోర్టులో పిల్‌వేసేందుకు టీజీఎంసీ సిద్ధమవుతోంది. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోనూ భారీ ఎత్తున నకిలీ క్లినిక్?లు బయటపడ్డాయి. పోలీసుల సహకారంతో అరెస్టు చేయడం, క్లినిక్‌లను సీజ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. తనిఖీల్లో దొరకిన నకిలీ వైద్యుల్లో 80 శాతానికి పైగా నగరంలో ఉండగా, ఇప్పటి వరకు కనీసం 10 శాతం క్లినిక్‌లపైనా పూర్తి స్థాయిలో చర్యలు లేవని తెలుస్తోంది. ఇంకొందరైతే తనిఖీల్లో పట్టుబడితే ఆయా ప్రాంతాన్ని వదిలి వేరే చోట కొత్త పేరుతో మకాం వేస్తున్నట్లు సమాచారం.

మిగతా 3లో..

క్షేత్రస్థాయి కష్టం, లౌకికవాద చరిష్మా

సతీశన్‌కు 'సీఎం' కుర్చీ దక్కడానికి కారణాలు

టి మీడియా, మే 18, త్రివేండ్రం :

కేరళ నూతన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ సోమవారం ప్రమాణం చేశారు. అయితే ఆయన సీఎం సీటు వరకు చేరడానికి ముందు, కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు ఎన్నో మలుపులు తిరిగాయి. మే 4న ఎన్నికల ఫలితాలు రాగా, వీడీ సతీశనే తదుపరి ముఖ్యమంత్రి అని మే 14న కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఈ మధ్యనున్న 10 రోజుల వ్యవధి (మే 4 - 14)లో సీఎం అభ్యర్థి ఎంపిక కోసం హస్తం పార్టీ హైకమాండ్ పెద్ద కసరత్తే చేసింది. ఇందులో భాగంగా అటు దిల్లీలో, ఇటు తిరువనంతపురంలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇంతకీ వీడీ సతీశన్?నే సీఎం పదవికి ఎందుకు ఎంపిక చేశారు ? పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతును పొందిన రాహుల్ గాంధీ సన్నిహితుడు కేసీ వేణుగోపాల్‌ను సైతం సతీశన్ ఎలా దాటేశారు? ఆయనకు సపోర్ట్ చేసిన కాంగ్రెస్ హైకమాండ్‌లోని ఆ బలమైన నేత ఎవరు ? రాష్ట్రస్థాయిలోని ఇంకా ఏయే అంశాలు ఆయనకు ప్లస్ పాయింట్లుగా మారాయి ? ఈ కథనంలో తెలుసుకుందాం.

మే 7 టు మే 14 : సీన్

మిగతా 3లో..

కేరళ సీఎంగా వీడీ సతీశన్ ప్రమాణ స్వీకారం

- ఖర్గే, రాహుల్, రేవంత్ హాజరు

టి మీడియా, మే 18, ఢిల్లీ బ్యూరో :

కేరళలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరింది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో కేరళ 13వ సీఎంగా వీడీ సతీశన్? సోమవారం ప్రమాణం స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. అయితే సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్? కూడా వచ్చారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ హాజరయ్యారు.

20 మంది మంత్రులు ప్రమాణం

సతీశన్?తో పాటు 20 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వారిలో 14 మంది తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఆదివారం యూడీఎఫ్ కూటమి పార్టీలతో చర్చల అనంతరం 20 మందికి మంత్రి పదవులను ఖరారు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితాల, కే మురళీధరన్, ఎపీ అనిల్ కుమార్, సన్నీ జోసెఫ్?తో పాటు ఐయూఎంఎల్‌కు చెందిన పీకే కున్హల్ కుట్టి, ఎన్ శంషుద్దీన్, కట్టఎం షాజీ, పీకట్ట బషీర్, వీఇ అబ్దుల్ గఫూర్ ఉన్నారు. టీ రాధాకృష్ణన్ స్పీకర్‌గా, షనిమోల్ ఉస్మాన్ (మహిళ) డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించనున్నారు.

11 రోజుల తర్వాత సీఎంగా సతీశన్ పేరు

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కేరళ ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ నడిచింది. కేసీ వేణుగోపాల్, సతీశన్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. దాదాపు 10 రోజులు పాటు మల్లగుల్లాలు, చర్చలు జరిగాయి. మే 14న కాంగ్రెస్ అధిష్ఠానం కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును అధికారికంగా ప్రకటించింది. మే 7న తిరువనంతపురంలో జరిగిన కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశంలో రాష్ట్రంలో సీఎల్పీకి కొత్త నాయకుడిని నియమించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు పూర్తి అధికారం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనికి అనుగుణంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా అనేక ఇతర నాయకులతో సమావేశమైన ఏఐసీసీ పరిశీలకులతో కాంగ్రెస్ అధ్యక్షుడు, సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విస్తృత చర్చలు జరిపారు. ఈ చర్చలన్నింటి ఆధారంగా వీడీ సతీశన్‌ను సీఎల్పీ నాయకుడిగా నియమించాలని నిర్ణయించారు.

న్యాయవాది టు సీఎం

కొచ్చి సమీప నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది. పదేళ్లు కేరళ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగం కేఎస్‌యూతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 2001 నుంచి పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఐదేళ్లుగా కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ప్రతిపక్ష నేతగా పినరయి విజయన్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేశారు. కేరళ ముఖ్యమంత్రి పదవికి ముగ్గురు సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడినప్పటికీ చివరకు సతీశన్ వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గుచూపింది. పదేళ్లుగా కేరళలో అధికారానికి దూరమైన పార్టీని విస్తృత ప్రజాబాహుళ్యం మద్దతుతో గెలిపించడంలో సతీశన్ కీలక పాత్ర పోషించారు. విపక్షనేతగా సమర్థంగా పనిచేయడంతో పాటు వామపక్షాల అధిపత్యానికి గండికొట్టారు.ఇటీవల జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 140 స్థానాలకు గాను 102 స్థానాల్లో అఖండ విజయం సాధించి, మూడింట రెండు వంతుల మెజారిటీని సొంతం చేసుకుంది. ఇందులో కాంగ్రెస్ 63 స్థానాలు గెలుచుకోగా, మిత్రపక్షాలైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఐయూఎంఎల్ 22, కేరళ కాంగ్రెస్ 8, ఆర్ఎస్పీ 3 స్థానాల్లో విజయం సాధించాయి.

నార్కో టెరర్ కేసు నిందితుడికి బెయిల్

● నిరవధిక జైలుశిక్ష కుదరదన్న సుప్రీంకోర్టు

టి మీడియా, మే 18, ఢిల్లీ బ్యూరో :
ఉగ్రవాద నిరోధక చట్టం యూఏపీఏ కేసుల్లో కూడా బెయిలే రూల్, జైలు మినహాయింపు అనే రాజ్యాంగ సూత్రం వర్తిస్తుందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. జమ్మూకశ్మీర్‌కు చెందిన నార్కో- టెరర్ కేసు నిందితుడు సయ్యద్ ఇఫ్తిఖార్ అంద్రాబీకి బెయిల్ మంజూరు చేస్తూ ఆ వ్యాఖ్యలు చేసింది. యూఏపీఏ కింద కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ, విచారణ ఆలస్యం పేరుతో వ్యక్తిని నిరవధికంగా జైలులో ఉంచలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. అంద్రాబీ తన పాస్‌పోర్ట్‌ను సమర్పించాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) 2020లో నమోదు చేసింది. యూఏపీఏతో పాటు ఐపీసీ వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు పెట్టుకుని, డ్రగ్స్ స్మగ్లింగ్ ద్వారా వచ్చిన డబ్బును ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించారనే ఆరోపణలు నిందితులపై ఉన్నాయి.

యూఏపీఏ సెక్షన్‌పై కీలక వ్యాఖ్యలు
యూఏపీఏ చట్టంలోని సెక్షన్ 43డి(5) ప్రకారం బెయిల్ మంజూరుకు కఠిన పరిమితులు ఉంటాయి. అయితే ఈ సెక్షన్‌ను ఆధారంగా చేసుకుని ఎవరినైనా నిరవధికంగా జైలులో ఉంచడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 22ల ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయపరమైన హక్కులు రక్షించబడాలని పేర్కొంది. బెయిల్ రూల్ జైలు ఎక్సెప్షన్ అనేది రాజ్యాంగ సూత్రం. 'నిర్దోషిత్వ భావన ప్రతి నాగరిక సమాజానికి మూలస్తంభం. యూఏపీఏ కేసుల్లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే కేసు పరిస్థితులను బట్టి అవసరమైతే బెయిల్ నిరాకరించే అవకాశం కూడా ఉందని స్పష్టం చేసింది.

కేఏ నజీబ్ తీర్పు బైండింగ్
2021లో వచ్చిన కేఏ నజీబ్ తీర్పును సుప్రీంకోర్టు మరోసారి ప్రస్తావించింది. విచారణలో అధిక ఆలస్యం జరిగితే యూఏపీఏ కేసుల్లో కూడా బెయిల్ మంజూరు చేయవచ్చని ఆ తీర్పులో పేర్కొన్న సంగతి తెలిసిందే. అదే తీర్పు దేశవ్యాప్తంగా అన్ని కోర్టులకు బైండింగ్ అని తాజా తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మాత్రమే కాకుండా సుప్రీంకోర్టు చిన్న బెంచ్‌లు కూడా ఆ తీర్పును పక్కన పెట్టలేవని పేర్కొంది. ఈ సందర్భంగా ఢిల్లీ అల్లర్ల కేసుకు సంబంధించిన గల్ఫిషా ఫాతిమా కేసులో వచ్చిన తీర్పుపై కూడా ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ తీర్పులో కేఏ నజీబ్ నిర్ణయాన్ని సరైన రీతిలో అనుసరించలేదని వ్యాఖ్యానించింది.

ఢిల్లీ అల్లర్ల కేసు ప్రస్తావన
ఢిల్లీ అల్లర్ల కేసుల్లో కొందరు నిందితులకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ, కార్యకర్తలు ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్‌లకు మాత్రం ఉపశమనం లభించలేదు. ఈ నేపథ్యంలో యూఏపీఏ కేసుల్లో బెయిల్ అంశంపై గత కొంతకాలంగా న్యాయవర్గాల్లో చర్చ కొనసాగుతోంది. తాజా తీర్పుతో మరోసారి ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.

కేసు వివరాలు ఇలా!
ఎన్ఐఏ దర్యాప్తు ప్రకారం, 2020 జూన్ 11న హంద్వారాలోని క్రైరో బ్రిడ్జ్ వద్ద పోలీసులు అబ్దుల్ మొమిన్ పీర్ కారును తనిఖీ చేశారు. ఆ సమయంలో రూ.20.01 లక్షల నగదు, రెండు కిలోల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని అరెస్ట్ చేశారు. అతడి విచారణలో వచ్చిన సమాచారంతో సయ్యద్ ఇఫ్తిఖార్ అంద్రాబీ, ఇస్లాం-ఉల్-హక్ పీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరు పాకిస్థాన్‌లోని సహచరుల నుంచి హెరాయిన్ సేకరించి జమ్మూకశ్మీర్‌తో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు సరఫరా చేసినట్లు దర్యాప్తులో తేలిందని ఎన్ఐఏ తెలిపింది. అలాగే అంద్రాబీ, అబ్దుల్ మొమిన్ పీర్‌లు 2016-17 మధ్య పాకిస్థాన్‌కు పలుమార్లు వెళ్లినట్లు దర్యాప్తులో బయటపడిందని పేర్కొంది. అక్కడ లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థల కార్యకర్తలను కలిసినట్లు ఆరోపించింది. డ్రగ్స్ అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించినట్లు చార్జ్‌షీట్‌లో ఎన్ఐఏ పేర్కొంది. అయితే విచారణ ఇంకా పూర్తికాకపోవడం, దీర్ఘకాలంగా నిందితుడు జైలులో ఉండటం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తాజా తీర్పు యూఏపీఏ కేసుల్లో భవిష్యత్తులో బెయిల్ పిటిషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బరైటీస్ పరిరక్షణకై 20న 'ఛలో ఏపీఎండీసీ'

● పోరాట కమిటీ కన్వీనర్ కందారపు మురళి

టి మీడియా, మే 18, రైల్వే కోడూరు:
రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైల్వే కోడూరుకు జీవనాధారంగా ఉన్న మంగంపేట బరైటీస్ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, బరైటీస్ పరిరక్షణకై ఏర్పడిన పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న 'ఛలో ఏపీఎండీసీ' కార్యక్రమానికి పిలుపునిచ్చామని కమిటీ కన్వీనర్ కందారపు మురళి తెలిపారు. సోమవారం రైల్వే కోడూరులో మీడియాతో మాట్లాడిన ఆయన, గతంలో ఉన్న ఎగుమతి విధానాన్ని రద్దు చేసి పౌడర్ బదులు ముడి రాయిని విచ్చలవిడిగా ఎగుమతి చేయడం వల్ల 20 ఏళ్లు నడవాల్సిన మంగంపేట పరిశ్రమ రెండేళ్లకే అదృశ్యమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే కోడూరులో 170కి పైగా పల్వరైజింగ్ మిల్లులు ఉన్నాయని, వీటిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. ఏపీఎండీసీలో 600 మందికి పైగా ఉద్యోగులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగా వేలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని గుర్తు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి పుట్టపర్తిలో కేంద్ర మంత్రితో కలిసి ఓ పరిశ్రమకు శంకుస్థాపన చేస్తూ రాయలసీమ భవిష్యత్తును మార్చేస్తున్నామని ప్రకటించారని, "మబ్బుల్లో నీళ్లు చూసి వంత ఒలకబోసుకోనా" అనే సినీ కవి గేయాన్ని గుర్తు చేశారు. ఎప్పుడో వచ్చే పరిశ్రమల గురించి కలలు కనమని చెప్పడం మాని, ఉన్న పరిశ్రమను చంపేయడం సమంజసమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 430 కేంద్రాల్లోని క్వారీలకు ఉద్యోగులను తరలించాలనే కుట్ర ప్రభుత్వం వద్ద ఉందని, ఇది స్థానిక ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోందని ఆరోపించారు. డిమాండ్లు:దేశీయ అవసరాల కోసం అరుదైన ఈ ఖనిజాన్ని వినియోగించాలి. రాయి బదులు పౌడర్‌ను మాత్రమే

ఎగుమతికి అనుమతించాలి. బల్క్ టెండర్ విధానాలను తక్షణం ఉపసంహరించాలి. ఒక కంపెనీకి టన్ను ?1,188, స్థానిక మిల్లులకు ?1,680కు అమ్మడం ఎంతవరకు సమంజసం?స్థానిక మిల్లు యజమానులు, కార్మికుల పట్ల వివక్ష చూపడం సరికాదు. విదేశాలకు ఎగుమతి చేస్తున్న కంపెనీకి ?500 తక్కువకు ఎందుకు ఇస్తున్నారు? ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఒక టన్ను ఖనిజం వెలికి తీయడానికి ?2,000లకు పైగా ఖర్చు చేస్తూ ?1,188కే అమ్మడం వెనుక జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర న్యాయ విచారణ జరపాలి. అందరికీ ఒకే ధర నిర్ణయించాలి. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున 'ఛలో ఏపీఎండీసీ' కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కందారపు మురళి పిలుపునిచ్చారు.

ట్రక్కు, వ్యాను ఢీ- 10 మంది మృతి

● ఉత్తర్‌ప్రదేశ్?లో రోడ్డు ప్రమాదం

టి మీడియా, మే 18, లఖీమ్‌పూర్ :
ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ వ్యాన్?, ట్రక్కు ఢీకోని 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఉత్తర్?ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా స్పందించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, లఖీమ్?పుర్? ఖీరీలో ఊంచ్? గ్రామంలోని సిసైయా జాతీయ రహదారిపై సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. టాటా మ్యాజిక్ వాహనంలో 12 మందికి పైగా ప్రయాణిస్తున్నారు. వీరిలో 8 మంది పురుషులు, 4 మంది మహిళలు ఉన్నారు. అందరూ కూలీ పనుల కోసం లఖీమ్?పుర్? ఖీరీకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రక్కును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే పెద్ద సంఖ్యలో గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

వ్యాన్ నుజ్జునుజ్జు
అయితే, ఈ ఘటనలో వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. శిథిలాల మధ్య చిక్కుకున్న మృతదేహాలను పోలీసులు, స్థానికులు అతి కష్టం మీద వెలికితీశారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని శవ పరీక్షలు నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని సమీప కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో నలుగురు గాయపడ్డారు. ప్రమాదంలో మరణించిన వారి గుర్తింపు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

సీఎం యోగి దిగ్భ్రాంతి
ఈ రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.

డ్రైవర్, కండక్టర్ సమయస్ఫూర్తి వల్ల తప్పిన పెను ప్రమాదం
ఇదిలా ఉండగా, అమేఠీ జిల్లాలో ఘోర ప్రమాదం తప్పింది. ప్రయాణికులతో వెళు న్న ఓ బస్సులో మంటలు చెలరేగాయి. డ్రైవర్, కండక్టర్ సమయస్ఫూర్తితో 35 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రయాగ్‌రాజ్ - ఫైజాబాద్ జాతీయ రహదారి లో దుర్గాపూర్ మార్కెట్ సమీపంలోకి బస్సు రాగానే ఇంజిన్ నుంచి పొగలు వచ్చాయి. ఇది గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డు పక్కన ఆపేశాడు. కండక్టర్ సాయంతో ప్రయాణికులందరినీ వేగంగా బస్సులోంచి కిందికి దించేశాడు. కాసేపటికే బస్సు పూర్తిగా మంటల్లో కాలిపోయింది.

మాస్ కాపీయింగ్ కలకలం

● పోలీసుల అదుపులో 11 మంది

టి మీడియా, మే 18,ఉప్పల్:
నాచారం పాయస్ డిగ్రీ కాలేజీలో ఆదివారం నిర్వహించిన ఐఐసీటీ (సీసిర్ -ఐసీటీ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంట్స్) రాత పరీక్షలో మాస్ కాపీయింగ్ కలకలం రేపింది.

నాచారంలో పరీక్షలో కలకలం
హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతంలో నిర్వహించిన ఐసీటీ పరీక్షలో మాస్ కాపీయింగ్ ఆరోపణలు కలకలం రేపాయి. ఉప్పల్ పరిధిలోని పాయస్ డిగ్రీ కాలేజీలో జరిగిన ఈ పరీక్షలో కొంతమంది అభ్యర్థులు సాంకేతిక పరికరాలను ఉపయోగించి కాపీయింగ్ చేస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది.

11 మంది అభ్యర్థులు పోలీసుల అదుపులో
ఈ సమాచారం మేరకు నాచారం పోలీసులు వెంటనే తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో నార్త్ ఇండియాకు చెందిన 11 మంది అభ్యర్థులను అనుమానితులుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం వారిని విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మైక్రోచిప్, బ్లూటూత్ పుకార్లేనా?
పరీక్షలో మైక్రోచిప్‌లు, బ్లూటూత్ పరికరాలు ఉపయోగించారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే పోలీసులు మాత్రం ఈ అంశాన్ని ఖండించారు. ఇప్పటివరకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం కాలేదని స్పష్టం చేశారు. ఈ వార్తల్లో చాలా వరకు పుకార్లు ఉన్నాయని తెలిపారు. అదుపులో ఉన్న అభ్యర్థులను విచారిస్తున్నారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని తెలిపారు. ఈ ఘటనతో పరీక్షల నిర్వహణపై మళ్లీ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

షికాగోలో జరిగిన ఘోర ప్రమాదం..

● నార్కెట్ పల్లికి చెందిన నవ్య మృతి..!

టి మీడియా, మే 18, నార్కెట్ పల్లి:
ఉన్నత ఆశయాలతో చదువుల కోసం అమెరికా వెళ్లిన ఓ తెలుగమ్మాయిని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. నల్గొండ జిల్లాకు చెందిన యువతి షికాగోలో జరిగిన ఘోర ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. వివరాల్లోకి వెళితే.. నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామానికి చెందిన గడసు శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె నవ్య (24) ఉన్నత విద్య కోసం రెండున్నరేళ్ల క్రితం అమెరికా వెళ్లింది. ఎంఎస్ పూర్తి చేసి, ప్రస్తుతం అక్కడ ఓ పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నట్లు తెలుస్తోంది. విధి నిర్వహణ అనంతరం ముగ్గురు స్నేహితులతో కలిసి కారులో ఇంటికి వెళ్తున్న క్రమంలో ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు తెలిసింది. వీరు ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు నవ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

శోకసంద్రంలో చెరువుగట్టు
చేతికొచ్చిన కూతురు అకస్మాత్తుగా, ఊహించని రీతిలో మృత్యువాత పడటంతో నవ్య స్వగ్రామం చెరువుగట్టులో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమార్తె మృతి విషయం తెలుసుకున్న శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

భౌతికకాయాన్ని రప్పించేందుకు మంత్రి కృషి
నవ్య అకాల మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 'ఉన్నత ఆశయాలతో ఉన్న నవ్య మరణం ఆ కుటుంబానికి తీరని లోటు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది' అని ఆయన పేర్కొన్నారు.

నూతన డిఎస్పీని ఘన సన్మానం

● యంఏ. ఖాదర్ పాషా

టీ మీడియా, మే 18, వనపర్తి బ్యూరో :
వనపర్తి జిల్లాకు నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వనపర్తి డీఎస్పీ జి.గిరిబాబుని తెలంగాణ జన సమితి వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎం.ఏ. ఖాదర్ పాషా సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించిప్రత్యేకశుభాకాంక్షల తెలియజేశారు.



ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఖాదర్ పాషా మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నూతన డీఎస్పీ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ముఖ్యంగా యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, మత్తు పదార్థాల (డ్రగ్స్) విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, వాటిని జిల్లా నుండి పూర్తిగా నిర్మూలించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో నేరాల నియంత్రణకు ప్రజల భద్రతకు కీలక జంక్షన్లలో, సమస్యాత్మక ప్రాంతాలలో సీసీ కెమెరాలను మరింత విస్తృతంగా ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో చట్టన్ని గౌరవిస్తూ శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తామని డిఎస్పి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యం.ఏ ఖాదర్ పాషా,రతన్ నాయక్,ఉద్యమ నాయకులు చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

"టర్మ్ ఇన్సూరెన్స్" రూ.కోటి నష్టమట

● కాలపరిమితిపై నిపుణుల సూచన

టి మీడియా, మే 18, ఢిల్లీ బ్యూరో :
కుటుంబ ఆర్థిక భద్రత కోసం ఆ ఫ్యామిలీలో సంపాదించే వ్యక్తి జీవిత బీమా పాలసీ తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రస్తుతం చాలా మంది వ్యక్తులు జీవిత బీమా ప్రాముఖ్యతను గుర్తించి తమ కుటుంబాలను ఆర్థికంగా రక్షించుకోవడానికి బీమా పాలసీలను కొనుగోలు చేస్తున్నారు. అయితే, మొన్నటి వరకు ఎక్కువగా పెట్టుబడులతో కూడిన జీవిత బీమా(ఎండోమెంట్) పాలసీలను తీసుకునేవారు. కానీ, ప్రస్తుతం తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలను అందించే టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలను కొనుగోలు చేస్తున్నారు. ఇంతకీ, టర్మ్ ఇన్సూరెన్స్ అంటే ఏమిటి? ఎన్నేళ్ల వరకు ఈ పాలసీ తీసుకుంటే మంచిది? దీనిపై నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

టర్మ్ ఇన్సూరెన్స్ అంటే ఏమిటి?
సంపాదించే వ్యక్తి లేదా కుటుంబానికి మూలాధారమైన వ్యక్తి అనుకోని సంఘటన వల్ల దూరమైతే.. ఆ ఫ్యామిలీకి "టర్మ్ ఇన్సూరెన్స్" అనేది ఆర్థికంగా అండగా నిలుస్తుంది. ఇది ఒక నిర్దిష్ట కాలానికి కొనుగోలు చేసే జీవిత బీమా పాలసీ. అంటే.. పాలసీ కాల వ్యవధిలో పాలసీదారు మరణిస్తే హామీ మొత్తం నామినీకి అందిస్తారు. ఒకవేళ పాలసీ కాలవ్యవధిలో పాలసీ చేసిన వ్యక్తి జీవించి ఉంటే ఎటువంటి మొత్తం చెల్లించరు. ఈ కారణంగానే మిగతా పాలసీలతో పోల్చి చూస్తే టర్మ్ బీమా ప్రీమియం కూడా తక్కువగానే ఉంటుంది. చిన్న వయసులో ఈ

పాలసీని కొనుగోలు చేసినట్లయితే ప్రీమియం మరింత తక్కువగా ఉండే ఛాన్స్ ఉంటుంది. ముఖ్యంగా తక్కువ ప్రీమియంతో, ఎక్కువ రిస్క్ కవరేజీని అందించడం ఈ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీల ప్రత్యేకత అని చెబుతున్నారు నిపుణులు.

ఎన్నేళ్లకు తీసుకుంటే మంచిది?
కుటుంబానికి ఆర్థిక భరోసా ఇచ్చే టర్మ్ ఇన్సూరెన్స్ ఎన్నేళ్ల వరకు ఉండాలి? ఈ విషయంలో చాలా మంది పొరపాట్లు చేస్తుంటారు. ప్రీమియం తక్కువే కదా అని వందేళ్లు వచ్చే వరకు పాలసీ తీసుకుంటారు. కానీ, ఇది ఆర్థికంగా సరైన నిర్ణయం కాదని చెబుతున్నారు నిపుణులు. సాధారణంగా 60 నుంచి 65 ఏళ్లు వచ్చేసరికి బాధ్యతలు తీరిపోతాయి. అప్పటికే పిల్లలు సెటిల్ అయిపోతారు. మీ సంపాదనపై ఎవరూ ఆధారపడని స్థితిలో టర్మ్ ఇన్సూరెన్స్ పెద్దగా అవసరం ఉండదు. అందుకే, పిల్లలు సెటిల్ అయ్యేవరకు అంటే గరిష్ఠంగా 65 ఏళ్ల వరకు టర్మ్ ప్లాన్ తీసుకోవడం ఉత్తమమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

మంచి కంపెనీని ఇలా సెలక్ట్ చేసుకోండి!
ఉదాహరణకు 25 ఏళ్ల వ్యక్తి కోటి రూపాయల పాలసీ తీసుకున్నాడనుకుందాం. అప్పుడు అతనికి 65 ఏళ్లు వచ్చే వరకు మొత్తం 40 ఏళ్ల పాటు ఏటా 15 వేల రూపాయల వార్షిక ప్రీమియం చెల్లించాలి.
ఒకవేళ సేమ్ పాలసీని ఆ వ్యక్తి 75 ఏళ్లకు తీసుకుంటే ప్రీమియం 21 వేల రూపాయలుగా ఉంటుంది. ఈ మొత్తాన్ని 50 సంవత్సరాల పాటు చెల్లించాలి. ఇక్కడ ప్రీమియం పెరగడానికి ముఖ్య కారణం ఇన్సూరెన్స్ కంపెనీలు ఏజ్ పెరిగే కొద్దీ వచ్చే ఆరోగ్య సమస్యలను పరిగణించి ప్రీమియం పెంచుతాయి. ఈ లెక్కన 65 ఏళ్ల పాలసీతో పోల్చితే 75 ఏళ్ల పాలసీకి ప్రతి ఏటా రూ.6 వేలు ఎక్కువ ప్రీమియం చెల్లించాలి. 75 ఏళ్ల వరకు పాలసీ తీసుకున్న వ్యక్తి మొదటి 40 ఏళ్లలోనే అదనంగా రూ.2,40,000(6000శ40=2,40,000) చెల్లిస్తారు. ఆ తర్వాత 65 ఏళ్ల నుంచి 75 ఏళ్ల మధ్య చెల్లించే మొత్తం ప్రీమియం విలువ రూ.2,10,000(21,000ఇ10=2,10,000) అవుతుంది. మొత్తంగా 75 ఏళ్లు వచ్చేసరికి రూ.4,50,000 అదనంగా చెల్లిస్తారు. అవసరం లేకున్నా టర్మ్ ఇన్సూరెన్స్?కు చెల్లించే అదనపు ప్రీమియాన్ని రిటైర్మెంట్ కోసం పెట్టుబడిగా పెట్టడం మంచిదని చెబుతున్నారు. ఉదాహరణకు 25 ఏళ్ల వయసు నుంచి ప్రతి ఏటా రూ.6 వేలను ఏదైనా మ్యూచువల్ ఫండ్?లో పెట్టుబడి పెడితే 75 ఏళ్లు వచ్చేసరికి 12శాతం రిటర్న్ వచ్చినా మీ పెట్టుబడి కాంపౌండింగ్ ఇంట్రెస్ట్?తో కలిపి రూ.1,44,00,000కు పైగా ఒకేసారి చేతికి అందుతుందని ఆర్థిక నిపుణులు సలహా ఇస్తున్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ఆశల ధర్నా

టి మీడియా, మే 18, వనపర్తి బ్యూరో:
ఆశా కార్యకర్తలు సిఐటి ఆధ్వర్యంలో సోమవారం తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ వనపర్తి పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తా నుండి ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే తుడి మేఘ రెడ్డి క్యాంప్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి ఎమ్మెల్యే పి ఏ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే సునీత జిల్లా కార్యదర్శి కే బుజ్జమ్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశలకు ఇచ్చిన హామీ ప్రకారంగా నెలకు ఫిక్స్ వేతనము 18000 నిర్ణయించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా కార్యకర్తల సమస్యలపై ఉసేత్తడం లేదని ఆరు ఆరోపించారుప్రతినెలా ఒకటో తేదీన ఆశ కార్యకర్తల అకౌంట్లో వేతనాలు జమ చేయాలని కోరారు పని భారం తగ్గించి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు ఆశల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తే అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని వారు ఆరోపించారు ప్రభుత్వము ఆశల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ ఆశ కార్యకర్తలు శ్యామల అనిత బాలకృష్ణ రాణి దేవి యశోద మహేశ్వరి మాధవి భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగ సాగిన 2 కె రన్ పాల్గొన్న చైర్మన్

మీడియా, మే 18, పెబ్బేరు:
99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న యూత్ స్పోర్ట్స్ వారోత్సవాలు పెబ్బేరు పట్టణంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ 2కె రన్ నిర్వహించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ జెండా ఊపి 2కె రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "యువత కేవలం చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా రాణించాలి. శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయి" అని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పట్టణంలో క్రీడా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్ పిలుపుతో పెబ్బేరు పట్టణ యువతీ యువకులు, విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి 2కె రన్‌లో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేష్ గౌడ్, ఎంపీడీవో వెంకటేష్, ఎంఈఓ జయరాములు, ఎంపీఓ రోజా, మార్కెట్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు దాసరి జములమ్మ, పర్వీన్ షకీల్, వెంకట్ రాములు, దయాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మోతే రాములు, బుర్రమోని రాములు యాదవ్, దాసరి రాముడు, మాజీ డైరెక్టర్ రాములు, ఉపాధ్యాయ సంఘం సభ్యులు, కేఎల్ఆర్ స్పోర్ట్స్ శంకర్, దామోదర్ అకాడమీ క్రీడాకారులు, వివిధ సంఘాల నాయకులు, మున్సిపల్ అధికారులు, క్రీడా ప్రేమికులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ సభ్యుల అధికారిక ప్రకటన

టీ మీడియా, మే 18, రామకృష్ణాపూర్ :
క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం కమిటీ సభ్యుల వివరాలను పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అధికారికంగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటన్ సృజన్ అబియాన్ కార్యక్రమం ద్వారాబూత్ స్థాయి నుండి బలోపేతం చేయడం, కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం కార్యకర్తలని, కష్టకాలంలో కూడా పార్టీ జెండాను మోసిన కార్యకర్తల త్యాగాలు ఎన్నటికీ మరువలేమన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకువెళ్లే బాధ్యత ప్రతి నాయకుడిది అని అన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి క్యాతనపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి పథకంలో నడిపిస్తుందని చెప్పారు. వైస్ ప్రెసిడెంట్ ,జనరల్ సెక్రటరీ, సెక్రటరీలు,ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, మీడియా కమ్యూనికేషన్, సోషల్ మీడియా కమిటీ ఈ నూతన కార్యవర్గం పార్టీని బలోపేతం చేసి రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి ప్రతినిధి అబ్దుల్ అజీజ్, సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్ గౌడ్, గాండ్ల సమ్మయ్య, మహిళా నాయకురాలు కొండవెణ పుష్ప, కొలిపాక దీప తదితరులు పాల్గొన్నారు.

పెంటన్నయాదవ్‌ను పరామర్శించిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

టీ మీడియా, మే 18, వనపర్తి బ్యూరో :
పెద్దమందడి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జగత్‌పల్లి సర్పంచ్ పెంటన్న యాదవ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. పెంటన్న యాదవ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న చిన్నారెడ్డి వైద్యుల సూచనలను పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గాయాల నుంచి పూర్తిగా కోలుకొని త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, సీనియర్ నాయకులు ఎంట్ల రవి పెంటన్న యాదవ్ త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.



డ్రగ్స్‌పై దండయాత్ర

- మూలాలు గుర్తించి నిర్మూలిస్తున్న పోలీసులు

టి మీడియా, మే 18, అమరావతి బ్యూరో :

వైస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం అదుపు తప్పి ప్రజలలో మరింత వ్యాప్తి చెందుతోంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం, ఉదాసీనత కారణంగా ఎంతోమంది యువత మత్తు పదార్థాల వ్యసనమనే ఊబిలో చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలో మత్తు పదార్థాల ముప్పును గుర్తించి దాని మూలాలను పెకిలించి వేసేందుకు విజయవాడ కమిషనరేట్ పోలీసులు దశలవారీగా ఒక 'నిర్మూలన ఉద్యమాన్ని' ప్రారంభించారు. దీని ఫలితంగా, రాత్రి వేళల్లో జరిగే నేరాల సంఖ్యలో గణనీయమైన తగ్గుదల ఇప్పుడు కనిపిస్తోంది.

రెండోసారి పాజిటివ్ వస్తే క్రిమినల్ కేసు నమోదు

పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వ్యక్తులకు కౌన్సెలింగ్ అందిస్తారు. మొదట (స్టేషన్ హౌస్ ఆఫీసర్) స్థాయిలో, ఆ తర్వాత ప్రభుత్వ ఆసుపత్రులలోని కౌన్సెలింగ్ కేంద్రాల వద్ద మానసిక వైద్య నిపుణులు వారికి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పిస్తారు. దీని అనంతరం వారి పేర్లను పోలీసు శాఖ అంతర్గత డేటాబేస్‌లో నమోదు చేస్తారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో నెగటివ్ వచ్చేంత వరకు సంబంధిత పోలీస్ స్టేషన్ల ద్వారా ఈ చర్యలు కొనసాగుతాయి. ఒకవేళ ఆ వ్యక్తికి రెండోసారి కూడా పాజిటివ్ వస్తే వారిపై (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేస్తారు.

మత్తు పదార్థాల మూలాలను గుర్తించేందుకు పాజిటివ్ వచ్చిన వ్యక్తులకు సంబంధించిన వివిధ అంశాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వీటిలో వారి కాల్ డేటా రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాల వివరాలు, సోషల్ మీడియా ఖాతాలు, వారి స్నేహితుల వివరాల వంటివి ఉన్నాయి. సింగ్‌నగర్ పరిధిలో జరిగిన ఒక సంఘటనలో యువకుడికి పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. అతను 'సారమ్మ' అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలియడంతో పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు ప్రారంభించారు. ఆమె తన ఏజెన్సీ ద్వారా 'జయసూర్య' అనే వ్యక్తి సహకారంతో గంజాయిని సేకరించి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా తన అక్రమ వ్యాపారం కోసం మైనర్లను, యువకులను డబ్బు ఆశ చూపి వాడుకుంటున్నట్లు కూడా గుర్తించారు. నున్న పోలీసులు ఆమెను అరెస్టు చేశారు.

అత్యధికులు 18 నుంచి 25 ఏళ్ల వయసువారే

పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన 978 మంది వ్యక్తులకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరించి డేటా రూపంలో పొందుపరిచారు. వీరిలో 551 మంది 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు. ఆ తర్వాతి అతిపెద్ద సమూహం 25 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల 176 మంది వ్యక్తులతో కూడి ఉంది.

డ్రగ్స్‌పై దండయాత్ర

"డ్రగ్స్?పై దండయాత్ర 1.0" (మత్తు పదార్థాలపై సమరం) అనే నినాదంతో ఐదుగురు మహిళా పోలీసు అధికారుల బృందం జిల్లా వ్యాప్తంగా ఒక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. వీరు 34 రోజుల పాటు 550 కిలోమీటర్ల మేర సైకిల్ ర్యాలీని నిర్వహిస్తూ వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

డ్రగ్స్ పై దండయాత్ర 2.0

పోలీసులు ఈ మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాన్ని గత నెల 6వ తేదీన ప్రారంభించారు. గతంలో గుర్తించిన 149 'హాట్‌స్పాట్‌ల' (అధిక నేరాల ప్రాంతాల)తో పాటు, ఇతర ప్రాంతాల్లో కూడా పరీక్షలు నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా జేబు దొంగలు, గొలుసు దొంగలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొనేవారు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన ఎవరినైనా లక్ష్యంగా చేసుకుని ఈ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షించిన సుమారు 5,000 మంది వ్యక్తులలో, 1,188 మందికి పాజిటివ్ ఫలితం వచ్చింది. ఈ పరీక్షల కోసమే ప్రత్యేకంగా ఒక బస్సును, దానితో పాటు ఒక వైద్యుడిని, ప్రయోగశాల సాంకేతిక నిపుణులను నియమించారు. 'రాపిడ్ టెస్ట్ కిట్‌ల'ను ఉపయోగించి కొకైన్, నల్లమందు, ఆంఫెటమైన్లు, బార్బిట్యురేట్లు, బెంజోడియాజెపైన్లు లేదా గంజాయి సేవించిన వ్యక్తులను అధికారులు గుర్తిస్తున్నారు. 3.0 దశలో విద్యా సంస్థలపై ప్రత్యేక దృష్టి.

రోడ్డుకు మధ్యలో విద్యుత్ స్తంభాలు

- స్థానికుల ఆందోళన

టి మీడియా, మే 18, ఢిల్లీ బ్యూరో :

ఒక రహదారి నిర్మిస్తే ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కలగాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల అదే రహదారి ఇప్పుడు ప్రమాదాలకు కేంద్రంగా మారింది. సాధారణంగా విద్యుత్ స్థంభాలు రోడ్డుకు ఇరువైపులా కనిపిస్తాయి. అయితే ఛత్తీస్‌గఢ్‌లో మాత్రం విద్యుత్ స్తంభాలు ఏకంగా రోడ్డుకే మధ్యలో నిలిచి వాహనదారులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో స్తంభాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు స్వల్ప ప్రమాదాలకు గురయ్యారని గ్రామస్థులు చెబుతున్నారు.

రహదారి మధ్యలో విద్యుత్ స్తంభాలు

కబీర్‌ధామ్ జిల్లాలోని పిపారియా నుంచి గంగాపూర్ వరకు ప్రజా పనుల శాఖ (పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్) సుమారు రూ.5 కోట్ల వ్యయంతో మూడు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులు చేపట్టింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ పనులు ప్రారంభించినప్పటికీ, ప్రస్తుతం అదే రహదారి వివాదానికి కారణమైంది. రహదారి నిర్మాణానికి ముందే అక్కడ అనేక విద్యుత్ స్తంభాలు ఉండగా, వాటిని తొలగించకుండా లేదా పక్కకు కూడా మార్చకుండా అధికారులు నేరుగా రోడ్డును నిర్మించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు రహదారి మధ్యలోనే మిగిలిపోయాయి.

ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం

ఈ పరిస్థితి కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, రాత్రి వేళల్లో ప్రయాణించే వారు ప్రాణాలను పణంగా పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో లేదా పొగమంచు సమయంలో ప్రమాదాల ముప్పు మరింత పెరిగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. రహదారి నిర్మాణ సమయంలో ప్రజా పనుల శాఖ, విద్యుత్ శాఖల మధ్య సరైన సమన్వయం లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

కోట్ల రూపాయలు ఖర్చు భద్రతా లోపం

ఈ అంశంపై గ్రామస్థులతో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదని విమర్శిస్తున్నారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటం వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని గ్రామస్థుడు అర్జున్ తెలిపారు. మరోవైపు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుకారాం చంద్రవంశీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

కాగా ఇంతకుముందెన్నడూ చూడని విధంగా రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు కనిపించడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రయాణికులు ఈ దృశ్యాలను తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. దీంతో ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారి అధికారుల పనితీరుపై నెటిజన్లు తీవ్ర విమర్శలు కురిపిస్తున్నారు. అలాగే ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.కనీసం ఈ వీడియోలు చూసైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించి, భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్య ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లపై 600 కేసులు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఆస్పత్రులు, కొందరు వైద్యుల వద్ద కొన్ని రోజులు సహాయకులుగా పని చేసి, ఆ అనుభవంతో కొందరు ఏకంగా క్లినిక్‌లు నడుపుతున్నారు. మరి కొందరు హోమియో తదితర కోర్సులు చదివి అల్లోపతి వైద్యులుగా చెలామని అవుతున్నారు. ఇంకొందరు ఆర్?ఎంపీలుగా పని చేసి ఆ అనుభవంతో ఏకంగా 10-15 పడకల ఆస్పత్రులు నడుపుతున్నారు. ఈ ఘటనలన్నీ టీజీఎంసీ తనిఖీల్లో బయటపడ్డాయి. ఆర్?ఎంపీల నిర్వాకంతో అప్పుడప్పుడు కొందరి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వీటితో పాటు సీజనల్? వ్యాధుల కాలంలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆర్?ఎంపీ కేంద్రాల్లోనే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి తరహాలో పడకలు వేసి నేరుగా సెలైన్లు ఎక్కిస్తున్నారు.

మోతాదుకు మించి యాంటీబయోటిక్స్

మరీ ముఖ్యంగా వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అవసరం లేకపోయినా అధిక మోతాదులో యాంటిబయోటిక్స్? సిఫార్సు చేయడం, అక్రమంగా గర్భ విచ్ఛిత్తులు చేయడం, పెయిన్? కిల్లర్లు, యాంటాసిడ్లు, స్టెరాయిడ్లు తదితర మందులు రోగులకు సూచిస్తున్నారు. ఫలితంగా అప్పటికప్పుడు రోగం తగ్గినప్పటికీ, తర్వాత తీవ్ర సమస్యగా మారుతుంది. కిడ్నీలు, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతున్నాయి. కొందరైతే క్లినిక్? ప్రాంతంలోనే అనుమతి లేకుండా మెడికల్? స్టోర్లు నిర్వహిస్తున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వైద్య కేంద్రాలపై దృష్టి పెట్టాల్సిన వైద్యాధికారులు ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావిడి చేస్తున్నారు. తర్వాత పట్టింపు లేనట్లు వ్యవహరిస్తున్నారు.

ఎందుకు పరారీలో ఉన్నారు?

- బండి భగీరథ్‌కు పోలీసుల ప్రశ్న
- పోలీసు కస్టడీ కోరుతూ పిటిషన్

టి మీడియా, మే 18, హైదరాబాద్ బ్యూరో :

బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పేట్ బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు కోసం ఆధారాల సేకరణపై ఎక్కువగా దృష్టి సారించారు. శనివారం రాత్రి నిందితుడు భగీరథ్?ను అరెస్టు చేసి పేట్ బషీరాబాద్ స్టేషన్‌కు తీసుకెళ్లాక దాదాపు రెండు గంటల పాటు విచారణ చేసి అతడి నుంచి వాంగ్మూలం నమోదు చేసి రిమాండు రిపోర్టులో పొందుపర్చారు. పోక్సో కేసు నమోదైన తర్వాత ఎందుకు పరారయ్యారని ప్రధానంగా ప్రశ్నించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఇద్దరి వాంగ్మూలాలను పోల్చి :

ఈ సందర్భంగా భగీరథ్ తన దగ్గరున్న పలు ఆధారాలను అందించడంతో పాటు తాను ఏ తప్పూ చేయలేదని పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు, వాంగ్మూలం ఆధారంగా కూడా పోలీసులు కొన్ని ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. చివరగా బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలంతో అతను చెప్పిన విషయాలను పోల్చి చూశారు. అనంతరం భగీరథ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయమూర్తి ముందు హాజరుపర్చి చర్లపల్లి జైలుకు తరలించారు. ఇంకా అతడిని పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకు కస్టడీకి తీసుకోవాలని నిర్ణయించి, కోర్టులో పిటిషన్ దాఖలుకు పోలీసులు సిద్ధం అవుతున్నారు.

మరికొందరి విచారణ?

మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదులో ఘటన జరిగినప్పుడు భగీరథ్‌తో పాటు ఉన్న స్నేహితులు, ఆ తర్వాత రాజీ కోసం ప్రయత్నించారంటూ దాదాపు 10 మంది పేర్లను చెప్పారు. వీరందరినీ సాక్షుల కింద విచారణ చేస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే బాలిక, ఆమె తల్లి, భగీరథ్ ఇచ్చిన వాంగ్మూలాలు పొందుపర్చిన నేపథ్యంలో సాక్షులు చెప్పే విషయాలు అత్యంత కీలకం కానున్నాయి. వీరంతా చెప్పిన విషయాలతో పాటు పోలీసులు టెక్నికల్?గా ఇతర రూపాల్లోనూ ఆధారాలు సేకరించనున్నారు. ఇప్పటికే మొయినాబాద్‌లోని రెండు ఫామ్‌హౌస్‌లు, నానక్‌రాంగూడలోని సర్వీస్ అపార్టుమెంటు తదితర ప్రాంతాల నుంచి పలు ఆధారాలను పోలీసులు సేకరించారు.

తానే అప్పగించానన్న బండి సంజయ్

పోలీసులు భగీరథ్‌పై మే 16న ఉదయం లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అతడిని పట్టుకోవడానికి పోలీసుల ఆధ్వర్యంలో 5 స్పెషల్? టీమ్స్?ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాసానికి సైతం వెళ్లి చెక్? చేశారు. ఈ నేపథ్యంలో తన కుమారుడిని తానే పోలీసులకు అప్పగించినట్లు అదే రోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో బండి సంజయ్ సోషల్ మీడియా ఎక్స్?లో ప్రకటించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే భగీరథ్‌ను అరెస్టు చేశామంటూ సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు.

మైనర్ బాలిక వాంగ్మూలమే కీలకం

ఈ కేసులో పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 183 ప్రకారం న్యాయమూర్తి సమక్షంలో మైనర్ బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేశారు. శనివారం ఉదయం పోలీసులు బాధితురాలిని మేడ్చల్ కోర్టుకు తీసుకెళ్లి వాంగ్మూల సేకరణను పూర్తి చేశారు. పోక్సో కేసుల్లో న్యాయమూర్తి ముందు ఇచ్చే వాంగ్మూలం ఎంతో కీలకంగా భావిస్తారు. కేసు దర్యాప్తు ప్రక్రియ మొత్తం దీని మీదే ఆధారపడి ఉంటుంది. ఈ వాంగ్మూలాన్ని అధికారులు వీడియో రికార్డింగ్ ద్వారా భద్రపరుస్తారు. బాధితురాలు కోర్టు విచారణకు వెళ్లాల్సిన అవసరం లేకుండా విచారణ సమయంలో ప్రధాన ఆధారంగా కోర్టు వారు దీనిని భావిస్తారు. ఫిర్యాదుదారు అయిన బాలిక తల్లి వాంగ్మూలాన్ని కూడా అంతకు ముందే రికార్డు చేశారు.

సిమ్ కార్డు మీదే-కానీ వాడేది మాత్రం ఎవరో?

- పోలీసుల నుంచి నోటీసులొస్తాయ్ జాగ్రత్త?!

టి మీడియా, మే 18, హైదరాబాద్ బ్యూరో :

రాజధాని నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి అనుకోకుండా ఓరోజు పోలీసుల నుంచి ఫోన్?కాల్ వచ్చింది. పెట్టుబడుల పేరుతో ఇతరులను మోసం చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడి పేరుతో ఉన్న ఉన్న సిమ్?, బ్యాంక్ అకౌంట్?లను ఈ మోసాల్లో వినియోగించారని తెలిపారు. వెంటనే పోలీస్?స్టేషన్?కు రావాలని అతడికి సమాచారం అందించారు. అయితే ఈ మోసాలతో తనకేమీ సంబంధం లేదని, తాను ఓ ప్రైవేటు ఉద్యోగినని పోలీసులకు వివరించి బయటపడేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.ఇవే పరిస్థితులు మనలో ఎవరికైనా రావచ్చు. నేరగాళ్ల ఈ రకంగా మనకు సంబంధించిన నంబరు, బ్యాంకు ఖాతాలను వినియోగించి మోసాలకు పాల్పడుతున్నారు. మరి ఇలాంటి సమస్యల నుంచి ఏ విధంగా బయటపడాలి? అనే విషయాన్ని ఇప్పుడు తెలుసుకుందాం.

ఒక్కో సిమ్?కు రూ.3000 కమీషన్

కంబోడియా, సింగపూర్?, థాయ్?లాండ్?, నైజీరియా వంటి తదితర దేశాల నుంచి ఉద్యోగాలు, స్టాక్? మార్కెట్, పెట్టుబడులు, బ్యాంకు ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టులకు పాల్పడుతున్న ముఠాలు అక్కడ నకిలీ కాల్? సెంటర్?లను ఏర్పాటు చేస్తున్నాయి. వీరు ప్రధానంగా భారతీయుల్ని మోసగించేందుకు ఇక్కడి సిమ్? కార్డు అవసరం ఉంటుంది. దీనికోసం సోషల్? మీడియాలో సిమ్?కార్డు సేల్స్?, డీల్స్? పేర్లతో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో సిమ్? కార్డు కోసం కమీషన్?గా రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు ఇస్తున్నారు.

ఉచిత రీఛార్జి అంటూ ఎరవేసి

ఈ కమీషన్ సొమ్ముల కోసం ఆశపడి కొందరు డిస్ట్రిబ్యూటర్లు, పాయింట్ ఆఫ్? సేల్? ఏజెంట్లు తమ వద్దకు వచ్చే కొనుగోలుదారుల కేవైసీ సేకరిస్తున్నారు. వారికి తెలియకుండానే వారి పేరుతో సిమ్?కార్డులను సంపాదిస్తున్నారు. అయితే కొందరు దళారులు మాత్రం పాయింట్? ఆఫ్? సేల్ వద్ద మకాం వేస్తున్నారు. నెల రోజుల పాటు ఉచిత రీఛార్జి అంటూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. వారు ఇచ్చిన వివరాల ఆధారంగా సిమ్?, బ్యాంకు ఖాతాలు ప్రారంభిస్తున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఇదే తరహాలో వేల సంఖ్యలో సిమ్ కార్డులు, బ్యాంకు ఖాతాలు విదేశాలకు చేరుతున్నాయి.

3 వేల వరకు సిమ్? కార్డులు చేరవేత

ప్రధానంగా కంబోడియా దేశంలోని నకిలీ కాల్? సెంటర్లు, సైబర్? నేరగాళ్లకు ఈ తరహాలో సిమ్? కార్డులు చేరవేస్తున్న తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన వేర్వేరు ముఠాల నుంచి 10 మంది నిందితులను తెలంగాణ పోలీసులు గతంలో అరెస్టు చేశారు. గత మూడు సంవత్సరాల వ్యవధిలో సుమారుగా 3 వేల వరకు సిమ్? కార్డులను విదేశాలకు చేరవేసినట్లు వారు విచారణలో తెలిపారు. దేశంలోని అనేక ప్రాంతాల నుంచి ఇదే తరహాలో సిమ్?కార్డులను సేకరిస్తున్నారు. ఈ విధంగా మోసాలకు పాల్పడుతున్న ముఠా నెట్?వర్క్?ను ఛేదించేందుకు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. అయితే ఈ కేసులో సర్వీస్? ప్రొవైడర్ల ప్రమేయం ఉన్నట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

మీ పేరుతో ఎన్ని సిమ్? కార్డులు ఉన్నాయో ఇలా తెలుసుకోండి

పోలీసుల నుంచి ఫోన్?కాల్? నోటీసులు వచ్చినప్పుడు మాత్రమే అనేక మంది తమ కేవైసీని గుర్తుతెలియని వారు అపరించినట్లు గుర్తిస్తున్నారు. అయితే ఇలా జరగకుండా ప్రతి ఒక్కరూ ముందుగానే జాగ్రత్తలు వహించాలి. ప్రతి ఒక్కరూ తమ ఆధార్? కార్డుతో ఉన్న సిమ్?కార్డుల వివరాలను ఘటఎశీజా.ఖఅఎష్టుతీఖ్ష్టఙ.ష్రశీజ.అఅ అనే ప్రభుత్వ వెబ్?సైట్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చని పోలీసులు చెబుతున్నారు. మీ సమాచారంలో వేరే నంబర్లు కనిపిస్తే వెంటనే ఆయా సిమ్? కార్డులను బ్లాక్? చేసి, ఫిర్యాదు చేసుకునే వీలుంటుందని అంటున్నారు. ఇప్పటి వరకు సంచార్?సాథీ వెబ్?పోర్టల్? ద్వారా 3.61 కోట్ల మంది ప్రజలు తమ పేరిట ఉన్న సిమ్? కార్డుల సమాచారం కోసం అభ్యర్థించారని వెల్లడించారు.

స్నేహాల విషయంలో బాలికలూ జాగ్రత్త

- పోక్సో కేసుల్లో నిందితులు ఎక్కువగా నమ్మినవారే

టి మీడియా, మే 18, హైదరాబాద్ బ్యూరో :

స్నేహం పేరుతో దగ్గరవుతారు. అదునుచూసి లైంగిక వేధింపులకు గురిచేస్తారు. తెలంగాణలో బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపుల్లో సగానికిపైగా నిందితులు స్నేహితులే కావడం ఈ అంశాన్ని స్పష్టం చేస్తోంది. ఇంటి చుట్టుపక్కలవారు, బంధువులు కూడా నిందుతుల్లో ఉండటం విస్మయానికి గురిచేస్తుంది. స్నేహం పేరుతో దగ్గరై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఇటీవల కేంద్రమంత్రి కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదుతో ఈ అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

స్నేహం ముసుగు మోసం

తెలంగాణ మహిళా భద్రతా విభాగం గణాంకాల ప్రకారం రాష్ట్రంలో రోజుకు సగటున 8 పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఎఫెన్సెస్ యాక్ట్) కేసులు నమోదు కావడం ఆందోళనకరమే. ఈ నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా స్నేహం ముసుగులో జరుగుతున్న మోసానికి సంబంధించి పిల్లల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని తల్లిదండ్రులకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు సూచిస్తున్నారు. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకూ రాష్ట్రంలో ఏకంగా 2,799 పోక్సో కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రత ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

94 శాతం కేసుల్లో తెలిసినవారి పనే

సగటున రోజుకు 8 మందికి పైగా మైనర్? బాలికలపై ఏదోవిధంగా లైంగిక దాడులు జరుగుతుండడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఒక్క హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 4 నెలల వ్యవధిలో 409 పోక్సో కేసులు నమోదవగా వాటిలో 385 మంది నిందితులు (94 శాతం) బాధితులకు తెలిసినవారేనని భరోసా కేంద్రం అధికారుల సర్వేలో బయటపడింది. వారిలో అత్యధికంగా 65 శాతం మంది స్నేహితులు కాగా 11 శాతం ఇంటి చుట్టుపక్కలవారు, 8 శాతం మంది దగ్గరి బంధువులు ఉన్నారు. 4 శాతం మందిలో పిల్లల్ని పాఠశాలకు తీసుకెళ్లే వాహనాల డ్రైవర్లు, చాక్లెట్ల వంటి తినుబండారాలు అమ్మే కిరాణా షాపుల యజమానులు, అపార్టుమెంట్లలో ఉండే వాచ్‌మెన్ ఉన్నారు.

పిల్లల్నీ ఒంటరిగా బయటకు

ఈ గణాంకాల ఆధారంగా స్నేహం విషయంలో మైనర్లు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఆ మేరకు తల్లిదండ్రులు వారికి అవగాహన కల్పించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా తెలిసీ తెలియని వయసులోని పిల్లల్ని ఒంటరిగా బయటకు పంపకపోవడం, ఇంట్లో ఒంటరిగా ఉంచాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వారి ప్రవర్తనను నిశితంగా గమనిస్తూ ఉండాలని, ఏమాత్రం అనుమానం వచ్చినా పిల్లలకు ధైర్యం చెబుతూ పూర్తి వివరాలు ఆరా తీయాలని స్పష్టంగా సూచనలు చేస్తున్నారు. బంధువులు, చుట్టుపక్కలవారు పిల్లలతో ప్రవర్తించే విధానంపైనా వారికి తెలియకుండా కన్నేసి ఉంచాలని అధికారులు కోరుతున్నారు.

బాధితులకు భరోసా

చిన్నారులపై లైంగిక దాడులు జరిగితే పోలీసులకు సరిగా చెప్పుకోలేరన్న ఉద్దేశంతో తొలుత భరోసా కేంద్రాల్లోని ఎక్స్?పర్ట్స్? వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. వారికి జరిగిన నేరం తీరును అధ్యయనం చేసి మెడికల్? పరంగా సాయం అందివ్వడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 2025 జూన్ నుంచి 2026 ఏప్రిల్ వరకూ భరోసా కేంద్రాల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే 2,799 పోక్సో కేసులు నమోదవడం గమనార్హం. నిందితులకు శిక్ష పడే వరకూ భరోసా కేంద్రాలు బాధితులకు ధైర్యంగా, అండగా ఉంటాయి.

క్షేత్రస్థాయి కష్టం, లౌకికవాద చరిష్మా

సతీశన్‌కు 'సీఎం' కుర్చీ దక్కడానికి కారణాలు



మారిపోయింది

కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో 2026 మే 7న ఏఐసీసీ కేంద్ర పరిశీలకులు తిరువనంతపురంలో తొలి అధికారిక సమావేశాన్ని నిర్వహించారు. సీఎం అభ్యర్థి ఎంపికకు సంబంధించిన ఈ సంప్రదింపు లలో కాంగ్రెస్‌కు చెందిన మొత్తం 63 మంది ఎమ్మెల్యేలలో 43 మంది కేసీ వేణుగోపాల్ వైపు మొగ్గు చూపారు. కేసీ వేణుగోపాల్ ప్రస్తుతం అలప్పుజ (కేరళ) నుంచి లోక్‌సభ ఎంపీగా, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్)గా వ్యవహరిస్తున్నారు. ఈయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సన్నిహితులు. ఈ కారణం వల్లే మే 7న జరిగిన సమావేశంలో మెజారిటీ కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతును పొందగలిగారు. కానీ మే 14న మధ్యాహ్నం తిరువనంతపురంలోని కేపీసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్‌పీ) తుది సమావేశంలో సీన్ మారిపోయింది. ముఖ్యమంత్రి ఎంపిక కోసం జరిగిన అంతర్గత ముఖాముఖి సంప్రదింపులలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 33 మంది సతీశన్‌కు మద్దతు పలికారు. కేసీ వేణుగోపాల్‌కు 22 మంది, రమేష్ చెన్నితాలకు 8 మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చారు. మరికొందరు ఎమ్మెల్యేలు తుది నిర్ణయాన్ని కాంగ్రెస్ అధిష్టానికే వదిలేశారు.

ప్రియాంక, ఐయూఎంఎల్ మద్దతు

కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) కూటమి కేరళలోని మొత్తం 140 స్థానాలకుగానూ 102 సీట్లను గెల్చుకుంది. వీటిలో అత్యధికంగా 63 సీట్లను కాంగ్రెస్, 22 సీట్లను ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) సాధించాయి. అంటే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అత్యంత ప్రధాన మిత్రపక్షం ఐయూఎంఎల్. కాంగ్రెస్‌లోని మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతుతో పాటు కీలక మిత్రపక్షం ఐయూఎంఎల్ మద్దతును సాధించడంలో సతీశన్ సఫలమయ్యారు. మే 4న కేరళ ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే వి.డి.సతీశన్ సీఎం అభ్యర్థిత్వానికి ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించింది. కాంగ్రెస్ అధిష్టానం, పరిశీలకులతో జరిపిన అంతర్గత చర్చల్లోనూ ఈవిషయాన్ని ఆ పార్టీ తెలియజేసింది. కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా ప్రస్తుతం కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా ఉన్నారు. వయనాడ్‌లో క్షేత్రస్థాయిలో ఐయూఎంఎల్ పార్టీకి ఉన్న బలం ప్రియాంకతో పాటు రాహుల్ గాంధీకి బాగా తెలుసు. అందుకే 22 అసెంబ్లీ సీట్లను కలిగిన ఐయూఎంఎల్ వైఖరిని కాంగ్రెస్ హైకమాండ్ తోసిపుచ్చలేకపోయింది. కేసీ వేణుగోపాల్‌కు కాంగ్రెస్ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, సతీశన్‌కు అనుకూలంగా ప్రియాంకా గాంధీ వైఖరిని తీసుకోవడంతో రాజకీయ పరిణామాలు మారిపోయాయి. మే 14న మధ్యాహ్నం తిరువనంతపురంలో సీఎల్‌పీ తుది సమావేశం వేదికగా కాబోయే సీఎం సతీశన్ అని ప్రకటించారు.

విపక్ష నేతగా కాంగ్రెస్ బలోపేతం

కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి అత్యంత బలహీనంగా ఉన్న సమయంలో సతీశన్ కేరళ విపక్ష నేతగా బాధ్యతలను స్వీకరించారు. విపక్ష నేత హోదాలో పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ సర్కారును ఎదుర్కొన్నారు. నిరుద్యోగం, వ్యవస్థీకృత అవినీతి, శబరిమలలో బంగారం దొంగతనం కేసు వంటి వాటిపై విజయన్ ప్రభుత్వాన్ని సతీశన్ నిలదీశారు. ఎన్నో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. డేటా, పరిశోధనల వివరాలతో ఆయన కేరళ అసెంబ్లీలో ప్రసంగాలు చేసేవారు. అధికార యంత్రాంగాన్ని జవాబుదారీగా ఉంచడంపై ఆయన ఆంగ్లంలో చేసిన వ్యాఖ్యలు యావత్ దేశంలో వైరల్ అయ్యాయి. లౌకిక రాజకీయాలకు కట్టుబడి సతీశన్ వ్యవహరించారు. అందుకే ఇప్పుడు ఆయనకు ఐయూఎంఎల్ పార్టీ మద్దతు లభించింది. అంతేకాదు, ఈ ఎన్నికల్లో యూడీఎఫ్ కూటమి ఎన్నికల ప్రచారానికి సతీశన్ సారథ్యం వహించారు. కేరళలోని 140 సీట్లలో 100కుపైగా సీట్లను యూడీఎఫ్ గెలవకుంటే, తాను రాజకీయాలకు వీడ్కోలు పలికి అరణ్యవాసానికి వెళ్లిపోతానని ఆయన ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు సతీశన్‌లోని ఆత్మవిశ్వాసానికి అద్దం పడుతున్నాయి. చివరకు ఆయన చెప్పినట్టే రాష్ట్రంలో ఎన్నికల ఫలితం వచ్చింది.

సతీశన్ యాత్ర - ప్రజలతో మమేకం

కేరళ అసెంబ్లీ ఎన్నికలకు ముందుసతీశన్ నెల రోజుల పాటు యూడీఎఫ్ పుదుయుగ యాత్రను నిర్వహించారు. ఇది యూడీఎఫ్ కూటమి భారీ విజయానికి బాటలు వేసింది. ఈ యాత్రలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ వైఫల్యాలు ఆయన ఎండగట్టారు. రాష్ట్రంలోని చాలా సమస్యలకు విధానపరమైన పరిష్కారాలను సూచించారు. నూతన కేరళ నిర్మాణం కోసం ఒక దార్శనికతను నిర్దేశించారు. దీనివల్ల యూడీఎఫ్ కార్యకర్తలు, మద్దతుదారులు చైతన్యవంతం అయ్యారు.

టీమ్ యూడీఎఫ్

2021 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఓడిపోయింది. దీంతో ఈ కూటమిలోని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) పార్టీ ఎల్‌డీఎఫ్ కూటమిలోకి మారుతుందనే ఊహాగానాలు వెలువడ్డాయి. ఆ తరుణంలో ప్రతిపక్ష నేత హోదాలో సతీశన్ టీమ్ యూడీఎఫ్ అంటూ అసెంబ్లీలో వాణిని వినిపించారు. ఆయన తనను తాను కాంగ్రెస్‌లోని ఒక వర్గానికి నాయకుడిగానో, కేవలం కాంగ్రెస్ నాయకుడిగానో ప్రదర్శించుకోలేదు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్‌పై ముఖ్యమంత్రి విజయన్ విమర్శలు చేసిన సమయాల్లో, ఆ పార్టీని సతీశన్ సమర్థించారు. టీమ్ యూడీఎఫ్ అంటూ గళం విప్పారు. అందుకే సతీశన్ సీఎం కావాలని ఐయూఎంఎల్ అంత బలంగా కోరుకుంది.

మిత్రపక్షాల మద్దతు

సతీశన్‌కు 22 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్న కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్న రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ మద్దతు ప్రకటించాయి. అందుకే సీఎం అభ్యర్థిత్వం కోసం సతీశన్‌ను ఎంపిక చేయడం అనేది కాంగ్రెస్ హైకమాండ్‌కు అనివార్యంగా మారింది. ఒకవేళ మిత్రపక్షాల వైఖరిని పట్టించుకోకుండా వేరొక నేతను కాంగ్రెస్ సీఎం చేస్తే, యూడీఎఫ్ కూటమి సర్కారును ఐదేళ్లు నడపడం సవాళ్లతో కూడుకున్న అంశంగా మారుతుంది.

కేరళలో శాసన మండలి లేదు

లోక్‌సభ ఎంపీ కేసీ వేణుగోపాల్‌కు ఢిల్లీ మనిషిగా కేరళలో పేరుంది. ఆయన 2017 నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒకవేళ వేణుగోపాల్‌ను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసి ఉంటే, కాంగ్రెస్ తక్షణమే రెండు కొత్త ఎన్నికల్లో పోటీ చేయాల్సి వచ్చేది. వేణుగోపాల్ ప్రస్తుతం అలప్పుజ నుంచి లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. ఇలాంటప్పుడు లోక్‌సభ ఎంపీ పదవికి రాజీనామా చేసి, ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలి. సీఎం అయిన ఆరు నెలల్లోగా ఎమ్మెల్యేగా ఎన్నిక కావాలి. ఉప ఎన్నికలో ఎవరైనా సరే ఓడిపోయే అవకాశాలు కూడా ఉంటాయి. ఇంకో కీలక విషయం ఏమిటంటే, కేరళలో కేరళకు శాసన మండలి లేదు. అందుకే వేణుగోపాల్‌ను మండలికి పంపే అవకాశమూ లేదు. ఈవిధమైన కారణాలతో కేరళ సీఎం పదవిని సతీశన్ దక్కించుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి కేరళలో క్షేత్రస్థాయిలో ఆయన సంపాదించిన పేరు ప్రఖ్యాతులే కలిసొచ్చాయి. ప్రతిపక్ష నేతగా హస్తం పార్టీ బలోపేతానికి గత ఐదేళ్లు గ్రౌండ్ లెవల్‌లో చేసిన శ్రమే ఫలించింది. ఆయనకు ముఖ్యమంత్రి పీఠాన్ని సాధించి పెట్టింది.